

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో గల 13 ఆదర్శపాఠశాలలలో 2024 -25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఆన్ లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నట్లు డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏ మండలంలో ఆదర్శపాఠశాలలు ఉన్నాయో ఆ పాఠశాలల్లోనే ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. 2024 -25 విద్యా సంవత్సరంలో 5 వ తరగతి చదువుతూ ప్రమోషన్ అర్హత కలిగిన విద్యార్థులు www.cse.ap.gov.in/apms.ap.gov.in వెబ్ సైట్ లో ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు ప్రవేశ రుసుం రూ. 75, ఒసి, బిసి విద్యార్థులు రూ. 150 చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలకు సంబంధిత ఆదర్శపాఠశాలల హెచ్‌ఎంలను సంప్రదించాలని తెలిపారు.

చీపురుపల్లిలో మారుతున్న సమీకరణాలు

- టిడిపి నుంచి పోటీకి తప్పుకున్న గంటా?
- ముందుకు రాని కళా
- ఎట్టకేలకు ప్రచారంలో దిగిన నాగార్జున



కర్లాంలో సమావేశానికి హాజరైన టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగార్జున

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

చీపురుపల్లి టిడిపిలో రాజకీయ సమీకరణాలు మలుపు తిరుగుతున్నాయి. ఇక్కడి నుంచి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును రంగంలోకి దింపేందుకు పార్టీ ఆదేశించినప్పటికీ ఆయన సున్నితంగా తిరస్కరించినట్టు ప్రచారం జరుగుతోంది. రెండో ప్రాధాన్యతలో పరిశీలించిన మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు కూడా ముందుకు రాలేదని సమాచారం. దీంతో, ఓవైపు విజయనగరం మాజీ ఎమ్మెల్యే మీసాల గీత పేరును పరిశీలిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్న ప్పటికీ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున రెండు రోజుల క్రితం తిరిగి నియోజకవర్గానికి చేరుకుని కర్లాం గ్రామంలో పర్యటించారు. దీంతో, అధిష్టానం దిశ మార్చినట్టుగా, తిరిగి నాగార్జునకు అభయం ఇచ్చినట్టు తెలుస్తోంది. వాస్తవానికి నాగార్జున తొలి నుంచీ చీపురుపల్లి నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని ఉన్నారు. ఇదే నియోజకవర్గంలో వైసిపి నుంచి రాజకీయంలో ఆరితేరిన మంత్రి బొత్స సత్యనారాయణ ఉన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్, వైసిపి జిల్లా సమన్వయ కర్తగా కూడా ఇదే నియోజకవర్గం పరిధిలోని మెరకముడిదాం జెడ్‌పిటిసిగా ఉన్నారు. వీరిని ఢీకొంటూ పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా నాగార్జున టిడిపి కేడర్‌లో ఉత్సాహాన్ని నింపారు. దీంతో, ఇటీవల జరిగిన శంఖారావం సభకు జిల్లాలో మిగిలిన నియోజకవర్గాలకన్నా ఎక్కువ మంది ఒకింత ఉత్సాహంగా హాజరయ్యానడంలో సందేహం లేదు. ఓడిన చోటే గెలవాలన్నది తన లక్ష్యమంటూ నాగార్జున తన ప్రసంగంలో నొక్కిచెప్పారు. దీంతో, కేడర్ కూడా నాగార్జునకే టిక్కెట్ వస్తుందన్న దీమా వ్యక్తం చేశారు. కానీ, బొత్స ప్రభావాన్ని విజయనగరం, విశాఖపట్నం పార్లమెంట్ స్థానాల్లో తగ్గించాలనే వ్యూహంతో అధిష్టానం గట్టిపోటీ ఇవ్వగలిగేవారిని దింపాలని భావించింది. బొత్స గెలుపుపై భయాందోళన కలిగించాలంటే గంటా శ్రీనివాసరావువే గెలుపు గుర్రమని కూడా భావించింది. అదే విషయాన్ని వెల్లడించిన గంటా తాజాగా చీపురుపల్లి వెళ్లలేనని పార్టీకి తేల్చిచెప్పినట్టుగా సమాచారం. అయితే, గంటాకు ప్రత్యామ్నాయ నియోజకవర్గం అంటూ చూపకపోతే చీపురుపల్లి నుంచి దిగుతారా? లేక పోటీలో లేకుండా ఉండిపోతారా అన్నది వేచిచూడాల్సిందే. ఇక నాగార్జున పెదనాన్న కళా వెంకటరావు పేరును కూడా రెండో ప్రాధాన్యతలో అధిష్టానం పరిశీలించినప్పటికీ ఆయన సున్నితంగా తిరస్కరించినట్టు సమాచారం. ఈనేపథ్యంలోనే అధిష్టానం పునరాలోచనలో పడినట్టు, గంటా రాకపోతే నాగార్జునకే అవకాశం ఇవ్వనున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇదే నియోజకవర్గం నుంచి వైసిపి తరపున అభ్యర్థిగా భావిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ ఇప్పటికే నియోజకవర్గంలో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిన సంగతి తెలిసిందే. ఇటీవల మీసాల వరహాలనాయుడ్ని పార్టీలోకి చేర్చుకున్నారు. త్వరలో టిడిపిని టార్గెట్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటికైనా అభ్యర్థి ఎవరనేది టిడిపి అధిష్టానం ఖరారు చేయకపోతే ఈలోపే నియోజకవర్గాన్ని చక్కబెట్టుకుని, ఇతర నియోజకవర్గాలపై దృష్టి కేంద్రీకరించే పరిస్థితి ఏర్పడుతుందని కూడా చర్చనడుస్తోంది.

సచివాలయాలు దేవాలయాలు

మంత్రి బొత్స సత్యనారాయణ • చంపావతి నదిపై వంతెన ప్రారంభం

ప్రజాశక్తి-గజపతినగరం

ప్రజలకు ఏ సమస్య వచ్చినా పరిష్కారం అవుతాయనే నమ్మకంతో దేవాలయాల మాదిరి ప్రజలు సచివాలయాలకు వెళ్తున్నారని రాష్ట్ర విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ప్రతి గ్రామంలో కనీసం 30 మంది సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, అంగన్వాడీ, ఎఎన్‌ఎంలు సేవలందిస్తున్నారని, గతంలో కార్యాలయాల చుట్టూ తిరిగే వారని, ఇపుడు ఇంటికే వచ్చి సేవలందిస్తున్నారని అన్నారు. గజపతినగరం మండలం గంగచోళ్లపెంటలో ఆర్‌బికెను, వెల్నెస్ కేంద్రాన్ని, గంగచోళ్లపెంట నుంచి పట్రువాడ వెళ్లేందుకు చంపావతి నదిపై రూ. 4.30 కోట్లతో నిర్మించిన వంతెనను శనివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభ లో మంత్రి బొత్స మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి వారి అవసరాలను, కష్టాలను తెలుసుకునే సచివాలయ ఉద్యోగులు ఉన్నత చదువులు చదివి వారి ప్రతిభతో వచ్చిన వారేనని తెలిపారు. సచివాలయంలో మీరిచ్చే వినతులు ఏమైనా ముఖ్యమంత్రి వద్దకు వెళ్లి వెంటనే మంజూరై వస్తాయని అన్నారు. పింఛను కోసం గ్రామంలో 8 మంది దరఖాస్తులు చేసుకున్నారని, వారికి జూన్ నుండి పింఛను అందుతుందని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య మాట్లాడుతూ 5 ఏళ్లలో ఈ గ్రామానికి రూ.14 కోట్లు ఖర్చు చేశామన్నారు. జెజెఎం కింద ఇంటింటికీ కుళాయిలు వేసే కార్యక్రమంలో ట్యాంకులు పూర్తి చేశామని తెలిపారు. ఎన్నో ఏళ్ల కళ గ్రీన్ ఫీల్డ్ హైవే ను తీసుకు వచ్చిన ఘనత ఈ ప్రభుత్వానిదేనని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి డాక్టర్ సురేష్ బాబు, సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్, బొబ్బిలి ఆర్‌డిఒ కె.సందీప్, తహశీల్దార్ రమేష్, ఎంపిడిఒ జయంత్ ప్రసాద్, ఎంపిపి బెల్లాన జ్ఞాన దీపిక, జెడ్‌పిటిసి గార తౌడు, సర్పంచ్ సంగమయ్య, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



వంతెన ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి సత్యనారాయణ, ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

ఎఐ స్కిల్ ల్యాబ్.. విద్యార్థులకు వరం

ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్

ప్రజాశక్తి-చీపురుపల్లి

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్కిల్ ల్యాబ్‌ని చీపురుపల్లి నియోజకవర్గంలో ప్రారంభించడం ఈ ప్రాంత విద్యార్థులకు వరంగా భావిస్తున్నానని ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. శనివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎఐ స్కిల్ ల్యాబ్‌ని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి శ్రీనివాసరావు, ఇంటెల్ ప్రతినిధి స్వేతాఖురాన, డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్‌పి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి ఎన్నో పథకాలతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందించే ందుకు సమూల మార్పులను తీసుకువచ్చారని తెలిపారు. అందులో భాగంగా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా చీపురుపల్లిలో ఎఐ ల్యాబ్‌ని ఏర్పాటు చేయడం శుభ పరిణామమని చెప్పారు.

మంత్రి చొరవతోనే ల్యాబ్ ఏర్పాటు

మంత్రి బొత్స సత్యనారాయణ చొరవతో రాష్ట్రంలోనే మొట్టమొదటి ఎఐ ల్యాబ్‌ని చీపురుపల్లిలో ఏర్పాటు చేసినట్లు సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులను కృత్రిమ మేధ వినియోగదారుల నుంచి కృత్రిమ మేధ సృష్టికర్తలుగా మార్చడమే ఈ ల్యాబ్ ప్రధాన లక్ష్యమన్నారు. విద్యను మరింత ప్రయోగాత్మకంగా, భవిష్యత్ ఆధారితంగా తీర్చిదిద్దడం, చిన్న వయస్సు నుండే డేటా అనాలసిస్, కంప్యూటేషనల్ థింకింగ్ వంటి కీలక నైపుణ్యాలను పెంపొందించుకోవడం ప్రధాన లక్ష్యాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష, చీపురుపల్లి సర్పంచ్ మంగళగిరి సుధారాణి, తల్లిదండ్రుల కమిటీ చైర్‌పర్సన్ బాలమ్మ, ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రావు, బెల్లాన వంశీకృష్ణ, కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద్, పతివాడ రాజారావు తదితరులు పాల్గొన్నారు.



ఎఐ ల్యాబ్‌ని పరిశీలిస్తున్న ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు

31వ రోజుకు మిమ్స్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

తమ సమస్యల పరిష్కారం కోసం మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల చేపట్టిన నిరసన కార్యక్రమం శనివారం 31వ రోజుకు చేరింది. స్థానిక ఆర్‌ఒబి వద్ద మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు చేపట్టిన నిరసన శిబిరాన్ని గరివిడి ఫేకర్ యూనియన్ నాయకులు అంబళ్ల గౌరినాయుడు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గౌరినాయుడు, మిమ్స్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు టివి రమణ మాట్లాడుతూ ఉద్యోగులకు న్యాయం చేయకుండా మిమ్స్ యాజమాన్యం చట్టాన్ని ధిక్కరించి 7 డిఎలు బకాయిలు ఉంచడం దారుణమన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 31 రోజులైనా జనవరి నెల జీతం ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా మిమ్స్ యాజమాన్యం మొండి వైఖరి వీడి చర్చలకు వచ్చి ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఉద్యోగులు మిరప నారాయణ, కాము నాయుడు, నాగభూషణం, అప్పలనాయుడు, మధు, మూర్తి, రాంబాబు, బంగారు నాయుడు, గౌరి, వరలక్ష్మి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



నిరసన శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న మిమ్స్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు టివి రమణ

6న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయనగరం కోట

వివిధ ప్రయివేటు కంపెనీల్లో మొత్తం 910 ఉద్యోగాల భర్తీ కోసం ఈనెల 6న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ రెడ్డీస్‌లో ట్రైనీ అప్రంటీస్ (90), భారత్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూసిన్ లిమిటెడ్‌లో లోన్ ఆఫీసర్ (150), శ్రీరక్షిత బిజినెస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో టెలీకాలర్స్(20), డెక్కన్ ఫైన్ కెమికల్స్‌లో ట్రైనీ కెమిస్ట్, అపరేషన్స్, మెయింటనెన్స్, ప్రొడక్షన్ ఎఎన్‌ఎఫ్‌డి (150), హెట్రో ల్యాబ్స్ లిమిటెడ్‌లో ప్రొడక్షన్, క్యూసి, క్యూఎ, ఆర్అండ్‌డి, టిఎస్‌డి, ఐపిక్యూఎ(130), టీంలీస్ (ఎస్‌బిఐ కార్డ్స్)లో బ్రాంచ్ రిలేషన్ షిప్ ఎక్జిక్యూటర్(150), ముత్తూట్ ఫైనాన్స్‌లో ప్రొబేషనరీ ఆఫీసర్, ఇంటర్న్(150), ఫ్యూషన్ మైక్రో ఫైనాన్స్‌లిమిటెడ్‌లో రిలేషన్‌షిప్ ఆఫీసర్(50), బ్రాంచ్ మేనేజర్ (20) తదితర ఉద్యోగాల భర్తీ జరుగుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు విజయనగరం, విశాఖపట్నం, హైదరాబాద్, పైడిభీమవరం, దువ్వాడ, బాచుపల్లి, తుని, ఆంధ్రా, తెలంగాణా ప్రాంతాల్లో ఆయా పోస్టును బట్టి పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ పేర్లను ముందుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌సిఎస్.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లోని జాబ్ సీకర్స్ లాగిన్‌లో నమోదు చేసుకొని, ఈనెల 6వ తేదీ ఉదయం 10 గంటలకు విజయనగరంలోని గంటస్థంభం సమీపంలోని ఎంఆర్ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు, సంబంధిత సర్టిఫికేట్ కాపీలు, రెండు పాస్ ఫొటోలతో హాజరు కావాలని కోరారు. ఇతర వివరాల కోసం 8919378915 నంబరుకు సంప్రదించాలని ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ అరుణ సూచించారు.

ఫిర్యాదుల నమోదుకు వ్యవస్థలు ఏర్పాటు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో వచ్చే సాధారణ, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వివిధ రాజకీయ పార్టీలు, ప్రజల నుంచి ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులను స్వీకరించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆయా నోడల్ అధికారులను ఆదేశించారు. ఫోను ద్వారా ఫిర్యాదులను అందించేందుకు రెండు ఫోన్ నెంబర్లను ప్రత్యేకంగా ఎన్నికల ఫిర్యాదులకోసం ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రసార మాధ్యమాలు, సామాజిక మాధ్యమాలు, సి-విజిల్ యాప్, 1950 ద్వారా వచ్చే ఫిర్యాదులను నమోదుచేసి సంబంధిత ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటిపై వెనువెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన కంప్లయింట్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ ఏర్పాటుపై శనివారం జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఫిర్యాదుల స్వీకరణ, నమోదుకు సంబంధించిన అన్ని విభాగాలు ఒకే కంట్రోల్‌రూంలో వుంటూ విధులు నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని డిఆర్‌ఒ ఎస్.డి.అనితను ఆదేశించారు. ఈ విభాగాల్లో పనిచేసేందుకు అవసరమైన సిబ్బంది, టి.వి.స్క్రీన్లు, కంప్యూటర్లు సమకూర్చడంపై ప్రతిపాదనలు రూపొందించాలని చెప్పారు. ఈ విభాగంలో పనిచేసే సిబ్బందికి తగిన శిక్షణ కూడా ఇవ్వాలని ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులన్నీ నమోదుచేసే అధికారిగా ముఖ్య ప్రణాళిక అధికారి వ్యవహరిస్తారని చెప్పారు. సమావేశంలో సిపిఒ పి.బాలాజీ, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఎన్ఐసి అధికారి బాలు, డిపిఆర్‌ఒ డి.రమేష్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రభాకరరావు, డిటి సూర్య, సమాచార శాఖ డిఇ ఎస్‌వి రమణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

రాగిపిండి పంపిణీ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం

ఎండియు వాహనాల ద్వారా రాగిపిండి పంపిణీని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ ప్రారంభించారు. స్థానిక కెఎల్‌పురం రామమందిరం వద్ద శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు రాగిపిండి ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం బలవర్ధక పోషకాహారమైన రాగిపిండిని ప్రభుత్వం సరఫరా చేస్తోందని చెప్పారు. కిలో రాగిపిండి ప్యాకెట్‌కు కార్డుదారులు రూ.11 చెల్లించాలని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రతీఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. రాగిపిండి కావాల్సిన వారికి ఒక కిలో బియ్యం తగ్గించి ఇస్తారని చెప్పారు. అనంతరం రేషన్ సరుకుల సరఫరాను తనిఖీ చేశారు. బయోమెట్రిక్ పనిచేయనివారికి ఐరిష్ ద్వారా రేషన్ సరుకులను పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరా అధికారి కె.మధుసూదనరావు, తాహశీల్దార్ ఎవి రత్నం, సిఎస్‌డిటి రామారావు తదితరులు పాల్గొన్నారు.



రాగిపిండి పంపిణీ చేస్తున్న జెసి కార్తీక్

సెకెండ్ ఇంటర్ పరీక్షకు 804 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. శనివారం మొదటి పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 10679 మంది హాజరు కావాల్సి ఉండగా 18875 మంది హాజరయ్యారు. 804 మంది గైర్హాజరయ్యారు. ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్ష జరిగిందని ఆర్ఐఒ ఎం. ఆదినారాయణ తెలిపారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ జరగలేదని తెలిపారు.

వేపాడ : వేపాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షకు 220 మందికి గాను 194 మంది విద్యార్థులు హాజరయ్యారు. 26 మంది గైర్హాజరయ్యారు. ఏ విధమైన అవాంతరాలు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని పర్యవేక్షణ అధికారి తెలిపారు.

పిటిసిలో మౌలిక వసతుల పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం కోట

సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా త్వరలో జిల్లాకు రానున్న కేంద్ర బలగాలు బస చేసేందుకు కల్పించాల్సిన మౌలిక వసతులను పరిశీలించేందుకు ఎస్‌పి ఎం.దీపిక శనివారం సారిపల్లిలోని జిల్లా శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. శిక్షణ కేంద్రంలో గదులను, మంచాలు, నీటి వసతులు, మంచినీటి సౌకర్యం, వంట గదులు, భోజనశాలను పరిశీలించి, కేంద్ర బలగాలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక వసతులను కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎస్‌పి వెంట అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్, ట్రైనీ ఐపిఎస్ మండ జావలి అల్ఫాన్స్, డిటిసి డిఎస్‌పి వీరకుమార్, విజయనగరం డిఎస్‌పి ఆర్.గోవిందరావు, ఎఆర్ డిఎస్‌పి యూనివర్స్, ఎస్‌బి సిఐ ఇ.నరసింహ మూర్తి, 2వ పట్టణ సిఐ కె.రామారావు ఉన్నారు.

జెఎన్‌టియులో ముగిసిన సెమినార్

విజయనగరం టౌన్ : జెఎన్‌టియు ఇంజినీరింగ్ విభాగం అధ్వర్యంలో రెండు రోజులు పాటు జరిగిన సెమినార్ శనివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ అరుణకుమారి మాట్లాడుతూ సాంకేతిక విజ్ఞానం పెంపొందించడం కోసం ఇటువంటి సెమినార్లు అవసరం ఉందన్నారు. అనంతరం రిజిస్ట్రార్ జయ సుమ ప్రసంగించారు. సెమినార్ లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

దొంగనోట్ల ముఠా అరెస్టు

రూ.15 లక్షల నకిలీ కరెన్సీ నోట్లు స్వాధీనం

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరంలోని గుమ్చి ప్రాంతంలో దొంగనోట్లు చలామణీ చేసేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుండి రూ.15 లక్షల దొంగనోట్లును స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి ఆర్.గోవిందరావు తెలిపారు. శనివారం విజయనగరం 2వ పట్టణ పోలీసు స్టేషనులో నిర్వహించిన సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. 2వ పట్టణ సిఐ కోరాడ రామారావుకు వచ్చిన సమాచారంతో ఎస్ఐ ఐ. దుర్గా ప్రసాద్ , సిబ్బందితో గుమ్చి ప్రాంతానికి చేరుకొని, అక్కడ అనుమానస్పదంగా సంచరిస్తున్న విజయనగరం వైఎస్ఆర్ నగర్‌కు చెందిన బంగారి చక్రధర్ (36), దత్తిరాజేరు మండలం గడసాం గ్రామానికి చెందిన చంద్రమణిపాల్ (33)ను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ. 25 వేలు చొప్పున నకిలీ కరెన్సీ రూ.500 నోట్లును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నోట్లును పరిశీలించి, వారిని విచారణ చేయగా, తమకు ఈ నకిలీ నోట్లును చలామణి చేసేందుకు ఒడిశా రాష్ట్రం జాపూర్ జిల్లా చెంచునార గ్రామానికి చెందిన చంద్రమణిపాల్ అనే వ్యక్తి విజయనగరం రైల్వే స్టేషను వద్ద రూ.15,50,000 విలువైన నకిలీ రూ.500 కరెన్సీ నోట్లు ఇచ్చారని తెలిపారు. అందుకు ప్రతిగా తాము రూ.3 లక్షల ఒరిజినల్ నోట్లును చంద్రమణిపాల్‌కు చెల్లించినట్లు అంగీకరించారన్నారు. బంగారి చక్రధర్ పై ఇప్పటికే విజయనగరం 1వపట్టణ పోలీసు స్టేషనులో రెండు రేప్ కేసులు ఉన్నాయని, అతడిపై రౌడీ షీటు కూడా ఉందని డిఎస్‌పి తెలిపారు. చక్రధర్ విజయనగరం సబ్ జైలులో రిమాండులో ఉండే సమయంలో గజపతినగరం కేసులో అరెస్టు అయిన చంద్రమణిపాల్ పరిచయం అయ్యాడని తెలిపారు. తాను దొంగనోట్లును చలామనీ చేస్తుంటానని, దత్తిరాజేరు మండలం గడసాం గ్రామానికి చెందిన రాజాన విష్ణు అనే వ్యక్తికి కూడా తానే దొంగనోట్లును సరఫరా చేస్తున్నట్లు తెలిపాడన్నారు. అప్పటి నుండి వారితో స్నేహం కొనసాగిస్తూ వస్తున్నట్లుగా నిందితులు అంగీకరించారని డిఎస్‌పి తెలిపారు. ఈ కేసులో పరారీలో ఉన్న చంద్రమణిపాల్ నుపట్టుకొనేందుకు ప్రత్యేక బృందాన్ని నియమించామని, అతడిని పట్టుకొంటే దొంగనోట్లు ముద్రణ ఎవరు చేస్తున్నది? ఎక్కడ చేస్తున్నది? ఈ నేరంలో ఇంకెవరైనా పాత్రధారులు ఉన్నారా? అన్న విషయాలు వెల్లడవుతాయన్నారు. ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసిన సిఐ కోరాడ రామారావు, ఎస్ఐ ఐ.దుర్గా ప్రసాద్, సిబ్బందిని ఎస్‌పి అభినందించినట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి గోవిందరావు

సానుభూతి సరే... చిత్తశుద్ధి ఏదీ?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కష్టాల్లో ఉన్నవారిని కలిసి సానుభూతి చూపడం మానవతా ధృక్పథం. ఎదుటి మనుషులను జాలి, దయ, కరుణ, సానుభూతితో తాత్కాలికంగా ఓదార్చవచ్చు. కానీ, వాటిలో చిత్తశుద్ధి లోపిస్తే అదే మనుషుల్లో తాము సాధించాలనుకున్న లక్ష్యంపై మరింత కసి, పట్టుదల పెరుగుతుంది. మిమ్స్ ఉద్యోగుల విషయంలో ప్రస్తుతం అదే జరుగుతోంది. మిమ్స్ యాజమాన్యం అందులోని ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయడం ద్వారా పనులకు దూరమయ్యే విధంగా వ్యవహరించి నెల రోజులు దాటింది. విధిలేని పరిస్థితుల్లో ఉద్యోగులంతా సిఐటియు నాయకత్వంలో సంఘటితమై ఫిబ్రవరి 1వ తేదీ నుంచి విధులకూ దూరమయ్యారు. నాటి నుంచి మిమ్స్ ఆసుపత్రి ఎదురుగా నిరసన శిబిరం నడపడంతోపాటు తిరగని చోటు లేదు. జిల్లా కలెక్టర్ మొదలుకుని డిసిఎల్, జెసిఎల్, చివరకు కార్మిక శాఖ కమిషనర్ వరకు వెళ్లి తమ సమస్యలు విన్నవించారు. ఈనేపథ్యంలో ఉద్యోగుల నిరసన దీక్షా శిబిరాన్ని ఇటు టిడిపి, జనసేన, అటు వైసిపి నాయకులు సందర్శిండం హర్షించదగినదే. కానీ, రాజకీయ పార్టీలు అంతటితో సరిపెట్టుకోవడంతో ఈ రెండు పార్టీలకు చెందిన నాయకుల్లోనూ చిత్తశుద్ధి లేదంటూ సంబంధిత ఉద్యోగులతోపాటు జిల్లాలో పబ్లిక్ టాక్.

మహాకవి గురజాడ అప్పారావు చెప్పిన 'ఒట్టిమాటలు కట్టిపెట్టి గట్టిమేల్ తలపెట్టవోయ్' అనే మాటలు అధికార పాలకపక్షాలకు బోధ పడడం లేదంటూ చాలా మంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కష్టాల్లోవున్న కార్మికులను పరామర్శించడం తప్ప, వారి తరపున పోరాడేందుకు ప్రయత్నించక పోవడమే ఇందుకు కారణం. ఒక మనిషి చేయలేని పని కొంతమందితో ఏర్పడిన సంఘం చేయగలుతుంది. ఒక సంఘం సాధించలేని సమస్యలు కొన్ని సంఘాలు కలిస్తే సాధ్యమౌవుతాయి. సంఘాలూ సాధించలేనివి రాజకీయ పార్టీల జోక్యంతో పరిష్కారమౌతాయి. ఇది చారిత్రక సత్యం. చరిత్ర నేర్పిన గుణపాఠం. కానీ, ఆయా రాజకీయ పార్టీల చిత్తశుద్ధిపైనే ఫలితాలు కూడా ఆధారపడి ఉంటాయి. మిమ్స్ ఉద్యోగుల పోరాటంపై అధికార ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు చూపిన మద్దతు, జాలి, సానుభూతి నేతి బీరకాయలో నెయ్యివెతికిన చందంగానే ఉంది. శిబిరాన్ని సందర్శించిన స్థానిక ఎమ్మెల్యేతోపాటు టిడిపికి చెందిన నాయకులు కూడా ఉద్యోగుల పోరాటం న్యాయమైనదేనని చెప్పారు. మిమ్స్ యాజమన్య వైఖరిని కూడా ఖండించారు. చివరకు ఇటీవలే జిల్లాకు చెందిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి దృష్టికి కూడా ఉద్యోగులు సమస్యలు తీసుకెళ్లారు. అయినా సమస్య పరిష్కారం కావడం లేదు? జిల్లా కలెక్టర్ దృష్టికి సైతం కార్మికులు తమ సమస్యలను తీసుకెళ్లినా పరిష్కారానికి ఆమె చొరవ చూపడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.



అసలు.. ఈ సమస్యలు పరిష్కారం కాకుండా అడ్డుకున్నదెవరు? ప్రభుత్వ ఆదేశాలను మిమ్స్ యాజమాన్యం భేఖాతారు చేస్తుందా? లేక యాజమాన్యంతో ప్రభుత్వ పెద్దలే మిలాఖత్ అయ్యారా? ఇంత జరుగుతుంటే తామే ప్రతిపక్షం అంటున్న టిడిపి ఏం చేస్తున్నట్టు? మీడియాను మేనేజ్ చేస్తున్నది ఎవరు? ఉద్యోగులకు అండగా నిలిచిన సిఐటియు నాయకుల నిర్బంధాలు, అరెస్టులకు పోలీసులను ఉసుగొల్పుతున్నదెవరు? కార్మిక శాఖ అధికారులు ఉద్యోగుల వాదన వినకుండా, యాజమాన్య నిరంకుశ వైఖరిపై ఎందుకు అంత మెతకవైఖరి అవలంభిస్తోంది? ఇలా... వందల ప్రశ్నలు మిమ్స్ ఉద్యోగుల్లోనే కాకుండా సాధారణ ప్రజల నుంచి కూడా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మిమ్స్ ఉద్యోగుల ఇబ్బందులపై అధికార, ప్రతిపక్షాలు మొసలి కన్నీరు కార్చడం ఆపేసి, ఉద్యోగుల కంటతడిని ఆపే విధంగా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని జనం కోరుతున్నారు.


అభివృద్ధిలో వైసిపి, టిడిపి విఫలం

ప్రజాశక్తి-బొబ్బిలి

అభివృద్ధిలో ప్రస్తుత వైసిపి, గత టిడిపి ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముప్పల శ్రీనివాసరావు విమర్శించారు. కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో టిడిపి హయాంలో జ్యూట్ పరిశ్రమలు మూత పడినా తెరిపించేందుకు చర్యలు తీసుకోలేదన్నారు. వైసిపి అధికారంలోకి వస్తే మూతపడిన పరిశ్రమలను తెరిపిస్తామని హామీ ఇచ్చినప్పటికి ఆచరణలో అమలు చేయలేదని విమర్శించారు. జ్యూట్, చక్కెర పరిశ్రమలు మూత పడడంతో కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. మూతపడిన పరిశ్రమలు తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చిన పార్టీలకు ఓటు వేయాలని కోరారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-వేపాడ



సిఎం సహాయనిధి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

మండలంలోని చామలాపల్లి గ్రామంలో ఇల్లు కాలిపోవడంతో మిగడ లక్ష్మీకాంత ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఆమెకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును శనివారం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మమ్ములూరి జగన్నాథం, వి.ఎస్.నాయుడు, కోల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ తెలిపారు. గొల్లపల్లిలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చి పని చేస్తున్నామన్నారు. రోడ్లు, కాలువలు నిర్మాణానికి గడపగడపకు మన ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. గొల్లపల్లిలో మిగిలిన రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేస్తామన్నారు. అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ ఎల్.రామలక్ష్మిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎఇ సురేష్ ఉన్నారు.

బస్‌పాస్ దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-గంట్యాడ

విలేకరులకు బస్‌పాస్‌ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎపిఎస్‌ఆర్‌టిసి సూపరింటెండెంట్ యర్రా వెంకటరావు తెలిపారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆయన విలేకరుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఇప్పటివరకు 39 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. వీరికి నాలుగు రోజుల్లో బస్‌పాస్‌లు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో విలేకరుల హక్కుల పోరాట కమిటీ జాతీయ కార్యవర్గ సభ్యులు కరక వెంకటరమణ పాల్గొన్నారు.

ఎస్.కోటలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-వేపాడ

జిల్లాలో గిరిజనుల కోసం శృంగవరపుకోటలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు చల్లా జగన్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కొండగంగుపూడి, చిట్టివానిపాలెం, కోటయ్యగరువు, బందవలస గ్రామాల్లో ఆయన పర్యటించి, గిరిజనులతో మాట్లాడారు. అనంతరం గిరిజనులతో కలిసి నిరసన చేపట్టారు. జిల్లా పరిధిలో వేపాడ, శృంగవరపుకోట, గంట్యాడ, బొండపల్లి, మెంటాడ, కొత్తవలస మండలాల్లో ఉన్న గిరిజనులకు ఎటువంటి ప్రత్యేక సదుపాయాలు లేవన్నారు. 1/70 చట్టం అమలుకాక, ఐటిడిఎ పరిధిలో లేక చదువుకున్న గిరిజన యువత ఉపాధికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే ఎస్.కోటలో ఐటిడిఎ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ కె.రామ మోహిని కోరారు. 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 5వ తరగతి ప్రవేశానికి వచ్చే నెల 27న, ఇంటర్ ప్రవేశానికి వచ్చే నెల 13న పరీక్ష జరుగుతుందని తెలిపారు.

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధిలో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపేస్తామని, వినియోగదారులు సహకరించాలని ఎఇ పిచ్చయ్య కోరారు. నగర పంచాయతీ పరిధిలో చంద్రబాబు నగర్ ఫీడర్‌లో చెట్ల తొలగింపు, మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. అగురువీధి, జంగాలవీధి, గాంధీనగర్ కాలనీ, కీర్తివీధి, సువ్వానివీధి, నాయుడుకాలనీ, కారుకొండ వీధి, అలబాన వీధి, శ్రీరామ్‌నగర్ కాలనీ, బైరెడ్డి వీధి, ఎస్‌సి కాలనీ, ఇందిరా కాలనీ, చంద్రబాబు నగర్ కాలనీ, డైట్ కాలనీ పరిధిలో విద్యుత్తు అంతరాయం ఉంటుందని తెలిపారు.

మారిక పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ



గిరిజనులతో మాట్లాడుతున్న ఎంఇఒ

మండలంలోని కరకవలస పంచాయతీ పరిధిలోని మారిక గిరిజన గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ జి.జగదీశ్వరరావు శనివారం పరిశీలించారు. నాలుగు కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లి ఆ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం మంజూరు చేసిన పాఠశాల భవనాన్ని నిర్మించుకోవాల్సిన అవసరం మీ అందరిపై ఉందని సూచించారు. చదువుతోనే అభివృద్ధి సాధ్యమని, పిల్లల భవిష్యత్తు బాగుంటుందని హితబోధ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కె.రమేష్, కె.తాతబాబు, కె.రాంప్రసాద్, సిఆర్‌పి పాల్గొన్నారు.

ఇ- క్రాప్ ముసాయిదా జాబితా ప్రదర్శన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సీతారామునిపేట రైతుభరోసా కేంద్రంలో రబీ ఇ-క్రాప్ ముసాయిదా జాబితా సాధారణ తనిఖీ కోసం ప్రదర్శన నిర్వహించారు. ఈ ముసాయిదాను వ్యవసాయాధికారి ఎం. పూర్ణిమ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ ఈ క్రాప్ ముసాయిదా జాబితా ను ఈ నెల 5వరకు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఉంచుతామని, అభ్యంతరాలు ఉంటే గ్రామ వ్యవసాయ సహాయకులకు ఫిర్యాదు చేస్తే గ్రీవెన్స్ పోర్టల్‌లో సవరణ చేస్తామని తెలిపారు. కాగా అభ్యంతరాలు 5లోగా తెలియ పర్చాలని కోరారు. కార్యక్రమంలో టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, కొత్తపేట సర్పంచ్ అట్టాడ శ్రీనివాస్, ఎఇఒ నాగరాజు, విఎఎ , కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని రావాడ పంచాయతీ చినరావాడ గ్రామానికి చెందిన పలువురు జనసేన పార్టీలో శుక్రవారం రాత్రి చేరారు. జనసేనా నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి లోకం మాధవి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా సరే తమ గ్రామానికి సరైన రహదారి సౌకర్యం కల్పించలేదని వారంతా తెలిపారు. 2019లో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు ఓట్లు వేసినప్పటికీ తమ గ్రామాన్ని పట్టించుకోలేదని వాపోయారు.

నేడు వేపాడలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-వేపాడ

మండల కేంద్రం వేపాడలో ఆదివారం గీతం వైద్యకళాశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు టిడిపి విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు భరత్ ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరానికి గీతం వైద్య కళాశాల, ఆసుపత్రి, జింసర్ ఆసుపత్రి వైద్య నిపుణులు హాజరుకానున్నారు. వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.

బొడ్డవలసలో కాలువల నిర్మాణం

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని సంకిలి పంచాయతీ పరిధి బొడ్డవలస గ్రామంలో కాలువల నిర్మాణ పనులు శనివారం ప్రారంభించారు. ఈ పనులను సర్పంచ్ బుడుమూరు పట్టాభి, పంచాయతీ కార్యదర్శి శివకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు.

పేదలకు పూర్తి హక్కులతో వసతి కల్పన

ఇళ్ల పట్టాల పంపిణీలో కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పేదలకు పూర్తి హక్కులతో వసతి సౌకర్యం కల్పించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇళ్ల హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వివిధ ప్రాంతాలలో నివసిస్తున్న 112 మంది లబ్ధిదారులకు హక్కు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్న పేద ప్రజలకు పూర్తి హక్కులతో కూడిన పత్రాలను అందివ్వడం ప్రభుత్వ సాహసోపేత నిర్ణయమని అన్నారు. గాజులరేగ, అయ్యకోనేరు గట్టు, కేఎల్ పురం, రాజీవ్ నగర్ కాలనీ, శాంతినగర్ ప్రాంతాలలో లబ్ధిదారులకు హక్కు పత్రాలను అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయా యాదవ్, తహశీల్దార్ పివి రత్నం, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు కంటుభుక్త తవిటి రాజు, పొట్నూరు శ్రీనివాసరావు, కనకల నాగవల్లి, పట్టా ఆదిలక్ష్మి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాల పంపిణీలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి చినప్పలనాయుడు

తాగునీటి కుళాయిలు ప్రారంభం

42వ డివిజన్ కాళీఘాట్ కాలనీలో ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ పిన్నింటి కళావతి, వైసిపి నాయకులు పిన్నింటి సూర్యనారాయణ, డివిజన్ పార్టీ అధ్యక్షుడు ఆరికతోట తిరుపతిరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో కోలగట్ల గెలుపునకు తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు.

అన్నీ ప్రజలు గమనిస్తున్నారు

బొబ్బిలిరూరల్ : ఏ ప్రభుత్వ హయాంలో ఎంత మేలు జరిగిందో ప్రజలన్నీ గమనిస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. శనివారం జగనన్న ఇంటి స్థల హక్కు పత్రాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా ఏవైతే చెప్పారో చేసి చూపించిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కిందని చెప్పారు. ఇంటి స్థలంతోపాటు ఇల్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని తెలిపారు. గతంలో చంద్రబాబు హయాంలో ఏ ఒక్కరికైనా సెంటు భూమి ఇచ్చారా? అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైసిపికి బ్రహ్మరథం పట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

4న రాజా కళాశాలలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక రాజా కళాశాలలో ఈ నెల 4న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ సిహెచ్.వీరేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హెటిరో ఫార్మా కంపెనీ నిర్వహించే ఇంటర్వ్యూలకు 2020 నుంచి 2024 లోపు డిగ్రీ బిఎస్‌సి, ఎంఎస్‌సి కెమిస్ట్రీ పూర్తి చేసిన పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్, బయోడేటాతో హాజరుకావాలని కోరారు.

తూతూ మంత్రంగా హౌసింగ్ డే

ప్రజాశక్తి- వేపాడ

వేపాడ మండల కేంద్రంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనరసింహ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన హౌసింగ్ డే కార్యక్రమం తూతూ మంత్రంగా సాగింది. ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. నిర్మాణం చేపట్టకుంటే ఇంటి పట్టాలు రద్దుచేస్తామన్నారు. సమావేశంలో హౌసింగ్ ఎఇ, ఎపిఎం, పంచాయతీ కార్యదర్శి గౌరి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వైసిపి నాయకులు గొర్రెల్ని కాసుకోవడమే

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి



మెంటాడ.. కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సంధ్యారాణి

ప్రజాశక్తి-మెంటాడ

మరో 40 రోజుల్లో వైసిపి నాయకులు గొర్రెల్ని కాసుకోవడమేనని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి వ్యాఖ్యానించారు. మండలంలోని జయతి గ్రామంలో బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.పి.భంజ్‌దేవ్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ నరకాసుర పాలనకు అంతమొందే రోజులు ఎంతో కాలం లేదన్నారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రజలకు రెండుసార్లు దీపావళి జరుపుకొనే అవకాశం కలిగిందన్నారు. అనంతరం భంజ్‌దేవ్ మాట్లాడుతూ సాలూరు నియోజక వర్గం అవినీతిమయంగా మారిందన్నారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలంటే టిడిపి అభ్యర్థి సంధ్యారాణిని ఎమ్మెల్యేగా గెలిపించు కోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని చెప్పారు. టిడిపి టికెట్ ఖరారైన తరువాత మొదటి సారి మండలానికి వచ్చిన సంధ్యారాణికు అపూర్వ ఆదరణ లభించింది. ఈ సందర్భంగా వైసిపి, బిజెపి నుంచి 30 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వారికి సంధ్యారాణి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చలుమూరి వెంకట రావు, జి.అన్నవరం, జి.ముసలి నాయుడు, రామచంద్రుడు, ఎస్.నారంనాయుడు, పి.రామ లింగేశ్వరరావు, రెడ్డి ఎర్నాయుడు, డి.అనిల్, గుమ్మిడి సింహాచలం, రెడ్డి సత్యనారాయణ, రాజగోపాల్, మనిపూరి రమణమ్మ పాల్గొన్నారు.

టిడిపి ఇంటింటి ప్రచారం

విజయనగరం కోట : నగరంలోని అరుంధతి కోలనీ, శాంతినగర్, సాలిపేట, కొత్తపేట యాత వీధి, సాకేటి వీధి, బంగారమ్మపేట ప్రాంతాల్లో నియోజకవర్గ ఇన్‌ఛార్జి పూసపాటి అదితి గజపతి రాజు ఇంటింటి ప్రచారం నిర్వహించి సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు, 20వ డివిజన్ సాలిపేట కు చెందిన బెహరా అచ్చియమ్మ, మొండి రమణమ్మ, జయలక్ష్మి తో పాటు 40 మంది మహిళలు అదితి గజపతి రాజు సమక్షంలో వైసిపి నుంచి టిడిపిలో చేరారు. వైసిపి పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడే వారిపై అక్రమ కేసులు పెట్టి కక్ష సాధింపు రాజకీయాలు చేయడం తప్ప ప్రజలకు చేసిన మంచి ఏమీ లేదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు,పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు , కార్యదర్శి గంటా పోలినాయుడు, వేచలపు శ్రీనివాసరావు, అవనాపు విజయ్ , పిల్లా విజయ్ కుమార్ పాల్గొన్నారు.



విజయనగరంకోట.. ప్రచారం చేస్తున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి

ఇఎండిపి జిల్లా స్థాయి ప్రాజెక్టుల ప్రదర్శన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

చదువుకోవడంతో పాటు ఉపాధి కల్పనా అవకాశాలను అన్వేషించి, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రణాళికలు తయారు చేసుకోవాలని జిల్లా డైట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.తిరుపతి నాయుడు విద్యార్థులకు సూచించారు. స్థానిక కంటోన్మెంట్ మున్సిపల్ పాఠశాలలో శనివారం జరిగిన ఎంట్రప్రెన్యూర్ మైండ్ సెట్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం జిల్లా స్థాయి ఎక్స్‌పోను శనివారం ప్రారంభించారు. ఇందులో 12 పాఠశాలల విద్యార్థులు తమ తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్రారంభ కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.తిరుపతి నాయుడు, ఎంఇఒ 1 రాజు, జిల్లా సైన్స్ అధికారి ఎమ్. కృష్ణా రావు తదితరులు పాల్గొని విద్యార్థుల ప్రదర్శనలను పర్యవేక్షించారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన జెడ్‌పిహెచ్ రేగిడి, ద్వితీయ స్థానం సాధించిన జెడ్‌పిహెచ్ చీపురుపల్లి ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇఎమ్‌డిపి జిల్లా మేనేజర్ నరేష్ పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్ పరిశీలన

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని పోలిపల్లి రెవెన్యూ పరిధిలోని అప్రోచ్ రోడ్డును ఆర్‌డిఒ సూర్యకళ శనివారం పరిశీలించారు. లేఔట్ యజమాని రహదారి కోసం ఉన్న పాత రహదారి నుంచి అనుమతించాలని దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె వచ్చి సంబంధిత రహదారిని పరిశీలించారు. ఈ రోడ్డు చెరువుగట్టుకు ఆనుకొని వెళు తుండడంతో ఇరిగేషన్ అనుమతులు ఉండాలని చెప్పినట్లు తెలుస్తోంది. తహశీల్దార్ పి.శ్యామ్‌ప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు, సర్వేయర్ ముదికేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంకిలి పాఠశాలకు ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి-రేగిడి

సంకిలి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు సంకిలి గ్రామ అభివృద్ధి కమిటీ తరపున ఫ్యాన్లను వితరణ చేశారు. వీటిని ఎస్ఐ శ్రీనివాసరావు... హెచ్ఎం ఎం.రామినాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు ఎస్ఐ పలు సూచనలు చేశారు. కమిటీ ద్వారా మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ శివ పాల్గొన్నారు.

చెల్లికే న్యాయం చేయలేదు

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన



బేబినాయనకు అభినందనలు తెలియజేస్తున్న లక్ష్మునాయుడు

ప్రజాశక్తి-బాడంగి

సొంత చెల్లికే న్యాయం చేయలేని సిఎం రాష్ట్రంలో మహిళలకు, అక్క చెల్లెమ్మలకు న్యాయం చేస్తాననడం చాలా విడ్డూరంగా ఉందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు అన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. వైఎస్ సునీత ప్రెస్‌మీట్‌లో చాలా ఆసక్తికరమైన విషయాలు మాట్లాడారని తెలిపారు. సొంత చెల్లి హంతకులకు ఓటు వేయొద్దని చెప్పడం చర్చనీయాంశమైందని చెప్పారు. టిడిపి ప్రభుత్వంలో ఉన్నప్పుడు చివరి రోజుల్లో సిబిఐ విచారణ వేయాలని, ప్రతి సమావేశంలో పదేపదే చెప్పి శవ రాజకీయాలు చేసి, వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్ల 10 నెలలు దాటినా సిబిఐ విచారణ ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. టిడిపి-జనసేన ప్రభుత్వం వచ్చాక దోషులకు శిక్ష తప్పదని హెచ్చరించారు.

నేనే అభ్యర్థి అనుకుని కష్టపడతా

వచ్చే ఎన్నికల్లో తానే అభ్యర్థి అనుకుని, బేబినాయన విజయానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు అన్నారు. శనివారం మండలంలో పార్టీ నాయకులతో కలిసి బేబినాయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకూ పార్టీని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. పార్టీలో ఎక్కడా గ్రూపులు లేవని స్పష్టంచేశారు. పార్టీలోకి ఎవరొచ్చినా ఆహ్వానించాలని సూచించారు. అనంతరం బేబినాయన మాట్లాడుతూ లక్ష్మునాయుడు సహకారం మరువలేనిదంటూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవిబాబు, వైస్ ఎంపిపి ఎస్.భాస్కరరావు పాల్గొన్నారు.

జగన్‌పాత్రపై విచారణ చేయాలి

విజయనగరం కోట : మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో జగన్ మోహన్ రెడ్డి పాత్రపై విచారణ జరగాలని విజయనగరం టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి పి.అదితిగజపతి రాజు డిమాండ్ చేశారు. అశోక్ బంగ్లాలో విలేకరులతో ఆమె మాట్లాడారు. అత్యంత కిరాతకంగా హత్య కాబడిన వివేకానందరెడ్డి గుండె పోటు తో మరణించారని అబద్ధపు మాటలు విజయసాయిరెడ్డితో ఎందుకు చెప్పించారో సమాధానం చెప్పాలన్నారు. ఈ హత్య కేసులో మొదట సిబిఐ విచారణ కోరిన జగన్, అధికారంలోకి వచ్చిన తర్వాత సిబిఐ విచారణ పిటిషన్ ఎందుకు వెనక్కి తీసుకున్నారో జవాబు చెప్పాలన్నారు. సునీత రెడ్డి అడుగుతున్న ప్రశ్నలకు కూడా సమాధానం చెప్పాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి జగన్ పై ఉందని అన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి-గజపతినగరం

గజపతినగరం, పురిటిపెంట పంచాయతీ కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని సిఐటియు జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఈ రెండు పంచాయతీల్లోనూ 40 మంది కార్మికులు పనిచేస్తున్నారని,. 2021 రూ.1500 వేతనం పెంచారని, ప్రస్తుతం రోజుకు రూ.300 చొప్పున రూ.9వేలు ఇస్తున్నారని తెలిపారు. రోజురోజుకూ ధరలు పెరుగుతున్నందున అందుకు అనుగుణంగా వేతనాలు పెంచాలని గత ఏడాది డిసెంబర్‌లో రెండు పంచాయతీల కార్యదర్శులకు వినతులు ఇచ్చామని తెలిపారు. గతనెల 5న కార్యదర్శులు, ప్రజాప్రతినిధులతో చర్చలుజరగ్గా తాము రూ.15వేలు జీతాలు ఇవ్వాలని అడిగామన్నారు. కనీసం రోజుకు రూ. 400 చొప్పున నెలకు రూ.12వేలు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఇవ్వలేమని వారు చెప్పడంతో కార్మికులు విధులు బహిష్కరించారన్నారు. వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కనకరాజు, నాగేశ్వరరావు, జి కృష్ణ, కష్ణ, కోటి తదితరులు పాల్గొన్నారు.

సీతంలో జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యాన శనివారం జిల్లాస్థాయి యూత్ పార్లమెంట్ విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి ఉజ్వల్ మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాలు, సహ పాఠ్యాంశాలను పెంపొందించుకోవాలని, కరెంట్ అఫైర్స్‌లో పాల్గొని రాజకీయాలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. మెడికల్ కౌన్సిలర్ త్రినాథ్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సమస్యలపై అవగాహన కలిగి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. జిల్లా ఉపాధి అధికారి బి.అరుణ మాట్లాడుతూ యువతకు ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగావకాశాలు ఎన్నో ఉన్నాయని అన్నారు. అనంతరం సెట్విజ్ సిఇఒ రామగోపాలరావు, బాలల హక్కుల చైర్మన్ కేసలి అప్పారావు, సీతం డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.


బాధ్యతలు స్వీకరించిన ఎంపిడిఒ, తహశీల్దార్

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ ఎంపిడిఒ, తహశీల్దార్‌గా కె.నిశ్చలత, బి.సత్యం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా ఉమ బాధ్యతలు నిర్వర్తించారు. ఆమె స్థానంలో పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ నిశ్చలతను నియమించారు. ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేసిన కె.ప్రసన్నకుమార్ ఇటీవల బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో గరివిడి తహశీల్దార్‌గా పనిచేసిన బి.సత్యం బదిలీపై ఇక్కడికి వచ్చారు.



ఎంపిడిఒ నిశ్చలత



తహశీల్దార్ సత్యం



సూర్యారావును సన్మానిస్తున్న డిఐపిఆర్ఒ రమేష్, అధికారులు, ఉద్యోగులు

సూర్యారావు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-విజయనగరం

సీనియర్ అసిస్టెంట్‌గా ఇ.సూర్యారావు అందించిన సేవలు మరువలేనివని డిఐపిఆర్ఒ డి.రమేష్ అభినందించారు. ఆయన సుమారు 44 ఏళ్లపాటు సమాచార పౌర సంబంధాల శాఖలో సుదీర్ఘంగా సేవలందించారని చెప్పారు. విధినిర్వహణ పట్ల సూర్యారావు చూపించిన అంకితభావం ఇతరులకు ఆదర్శనీయమని పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పౌర సంబంధాల శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా సేవలందించి, ఫిబ్రవరి నెలాఖరున ఉద్యోగ విరమణ చేసిన సూర్యారావును శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సూర్యారావు చేసిన సేవలను కొనియాడారు. సన్మాన గ్రహీత సూర్యారావు మాట్లాడుతూ శాఖలో తన ఉద్యోగ జీవిత అనుభవాలను వివరించారు. తాను 44 ఏళ్లపాటు పార్ట్‌టైమ్, కంటింజెంటు, అటెండరు, టైపిస్టు, సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేశానని, తనకు విధి నిర్వహణలో సహకరించిన అధికారులకు, సహోద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. డిఇఇ ఎస్‌వి రమణ, ఎఇ శ్రీలక్ష్మి, పిఆర్‌ఓ మజ్జి వాసు, ఎవిఎస్ సత్యనారాయణ, రికార్డు అసిస్టెంట్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వంట పాత్రలు , టార్పాలిన్లు వితరణ

నెల్లిమర్ల : ఇటీవల నారాయణపట్నంలో జరిగిన అగ్ని ప్రమాద బారిన పడిన బాడి తభూను రమేష్, పతివాడ సత్యం కుటుంబాలకు యన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన వంట పాత్రలు, టార్పాలిన్లు అందజేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు పోలుబోతు దుర్గా ప్రసాద్, డి.గౌరీ పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

విజయనగరం కోట : పేదలకు తమ సేవలను నిరంతరం కొనసాగిస్తూనే ఉంటామని కెఆర్ హెల్పింగ్ హాండ్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బి. కాంతారావు అన్నారు. శనివారం స్థానిక అద్దేపల్లి వారి వీధిలో యాత కార్పొరేషన్ డైరెక్టర్ గుంప అప్పలరాజు ఆధ్వర్యంలో పేదలకు బియ్యం ప్యాకెట్ల పంపిణీ చేశారు. బిసి సంక్షేమ సంఘం నాయకులు ముద్దాడ మధు, జానకీ రాం, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలో ముసిరాం గ్రామంలో నాటు సారా స్థావరాలపై శనివారం పోలీసులు దాడులు చేపట్టారు. 800 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేసినట్లు సిఐ చంద్రశేఖర్ తెలిపారు. నాటుసారా తయారీదారులపై కఠినంగా చర్యలు చేపడతామని సిఐ హెచ్చరించారు.

మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-రామభద్రపురం

మండల కేంద్రంలో 14 మద్యం సీసాలు తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ తెలిపారు. ద్విచక్ర వాహనం, మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నేరాలు ఘోరాలు

ఫోర్జరీ కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం పోలీసు స్టేషనులో ఇటీవల నమోదైన ఫోర్జరీ కేసులో నిందితుడు అంబులెన్స్ శివ ను శనివారం అరెస్టు చేసి, రిమాండుకు తరలించినట్లుగా వన్ టౌన్ సిఐ బి.వెంకటరావు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాలో జి.ఆర్.పి. విభాగంలో కానిస్టేబుల్ గా పని చేస్తున్న శ్రీనివాసరావు అనే వ్యక్తికి అంబులెన్స్ శివ పరిచయమై, విజయనగరం వన్ టౌన్ పోలీసు స్టేషనులో కానిస్టేబులుగా పని చేస్తున్న హేమంత్ కుమార్ విజయనగరం జిల్లా నుండి తూర్పు గోదావరి జిల్లాకు మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్‌గా వెళ్లేందుకు ఆసక్తి కనబరుస్తున్నారని నమ్మించి, శ్రీనివాసరావు నుండి రూ.2.5 లక్షలు తీసుకున్నాడని సిఐ తెలిపారు. హేమంత్ కుమార్‌కు మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్‌లో వెళ్లేందుకు ఆసక్తి లేకపోయినప్పటికీ అతని పేరున ఒక దరఖాస్తు రాసి, హేమంత్ కుమార్ సంతకాన్ని అంబులెన్స్ శివ ఫోర్జరీ చేసి, శ్రీనివాసరావుకు అప్పగించారు. శ్రీనివాసరావు మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్‌కు ప్రయత్నం సాగించి, బదిలీ అవ్వడంతో, ఉన్నతాధికారుల నుండి బదిలీ అయినట్లుగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ విషయం హేమంత్ కుమార్ కు తెలిసి, తాను ఎటువంటి దరఖాస్తు చేయలేదని, ఉన్నతాధికారులకు తెలిపారు. దీంతో అంబులెన్స్ శివ పై వన్ టౌన్ పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేయగా, వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈనేపథ్యంలో శివను అరెస్టు చేసి, రిమాండుకు తరలించామని సిఐ వెంకటరావు తెలిపారు.